క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో రణమండల ఆంజనేయస్వామి

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని రణమండలకొండలో వెలిసిన ఆంజనేయ స్వామికి ధనుర్మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తమలపాకులు, తులసీహారం, పూలతో అలంకరించారు. నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

శ్రీమఠంలో కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న ఈశ్వరప్ప దంపతులు

మంత్రాలయం: సద్గురు రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి ఈశ్వరప్ప ఆయన సతీమణితో కలిసి మంగళవారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలతో హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు



జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ఎన్.రామం

ఆదోనిటౌన్: ఆదోని ఆర్టీసీ డిపో పరిధిలోని ఖాళీ స్థలాలను 15 ఏళ్ల కాల వ్యవధితో అద్దె ప్రాతిపదికన కేటాయించనున్నారు. ఈ మేరకు మంగళవారం డిపో సమావేశ హాలులో ఔత్సాహికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిపో పరిధిలో 30 సెంట్ల స్థలం ఖాళీ ఉందని, ఈ స్థలం లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచామని జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ఎన్.రామం తెలిపారు. ఆసక్తి కలిగిన ఔత్సాహికులు టెండర్లలో పాల్గొనవచ్చన్నారు. సదస్సులో డిప్యూటీ సీటీఎం కె.వి.రమణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈశ్వరయ్య, డీఎం రఫిక్ అహ్మద్, ఔత్సాహికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోసిగి: బాల్య వివాహాలు అరికట్టేందుకు కలిసికట్టుగా ఉద్యమించాలని నవభారత యువత అసోసియేషన్ సామాజిక కార్యకర్త రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నాగేశ్వరి దేవి సమక్షంలో నవభారత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాలు చేయడంతో ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిళ్లకులోనై ఎన్నో అనర్థాలకు దారితీస్తోందన్నారు. మాతశిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా అరికట్టడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులు జ్యోష్ణరాణి, దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ఆదోనిటౌన్: ఆర్టీసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు తులసిరామ్, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆదోని డిపో మేనేజర్ మహ్మద్‌రఫిక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆర్టీసీలో వర్కర్స్‌కు ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం అన్ స్కిల్‌కు రూ.11,356, సెమీ స్కిల్ వర్కర్‌కు రూ.13,415, స్కిల్డ్ వర్కర్‌కు రూ.16,458, డేటా ఆపరేటర్స్‌కు రూ.12,385 చొప్పున వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పాలనను నిలబెట్టుకుందాం



హనవాల్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సంక్షేమానికి నిరంతరం తపిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుని సంక్షేమ పాలనను నిలబెట్టుకుందామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని హనవాల్ గ్రామంలో రెండో రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎమ్మెల్యే 315 గృహాలను సందర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని నవరత్నాల పథకాలు సక్రమంగా అందుతున్నాయా? మీ సమస్యలు ఏమిటి? మంచినీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు వంటి సమస్యలు ఉన్నాయా? ప్రజల ఆరోగ్యం గురించి తెలుసుకుంటూ ముందుకు సాగారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. పేద ప్రజలకు నేనున్నాననే భరోసాను వైఎస్ జగనన్న కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా పేద ప్రజల నుంచి హౌసింగ్ బిల్లుల కోసం డబ్బులు తీసుకుని మోసం చేశారన్నారు. పసుపు కుంకుమ, మరుగుదొడ్లు బిల్లులు, నీరుచెట్టు పథకాల ప్రజాధనాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో హనవాల్ గ్రామంలో ఎలాంటి లంచాలు, అవినీతికి తావు లేకుండా వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.16,50,89,000 వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. జగనన్న కాలనీలో 93 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఉపాధి హామీ పథకం కింద రూ.30 లక్షలతో మురుగు కాలువలు, గ్రావెల్ రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. అలాగే రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ స్కూల్‌లో రూ.45 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణంలో ఉన్నాయన్నారు. రూ.79 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పైపులైన్ వేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచ్ నారాయణప్ప, ఎంపీటీసీ చాకలి ఈరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్, నాయకులు కామాక్షి తిమ్మప్ప, దేవిశెట్టి మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, గురునాథ్‌రెడ్డి, గోపాలరావుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కౌతాళం: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాచాపురం సర్పంచు జయమ్మతో కలిసి కౌతాళం సచివాలయం -2 పరిధిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ తోవలోనే వైఎస్ జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులతో దేశంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. సచివాలయం పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచార్, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, జేసీఎస్ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, మండల నాయకులు దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఇంటికే పింఛన్ తెచ్చి ఇస్తున్నారు'

మంత్రాలయం: నిమ్మ సర్కార వళ్లె అయితప్పా.. ఇంటికే పింఛన్ తెచ్చి ఇస్తున్నారు. మా భూములకు రైతు భరోసా. పంట బీమా వచ్చింది. బీదలకు ఎంతో మేలు చేస్తున్నారప్పా.. 'అంటూ చేతులు జోడించి కౌతాళం మండల కేంద్రం బయటిగేరి పెద్ద ఈరన్న చెప్పుకొచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి చెట్టు అరుగుపై కూర్చున్న పలువురు వృద్ధులు కంట పడ్డారు. ఎమ్మెల్యే వారి వద్దకు వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న క్రమంలో పెద్ద ఈరన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై తన అభిప్రాయాన్ని స్పష్టం చేయడం పలువురిని ఆకట్టుకుంది. మళ్లీ మా ఆశీర్వాదం మీకే ఉంటుందంటూ ఆ వృద్ధుడు ఎమ్మెల్యేతో పేర్కొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ

మండలం పరిధిలోని రాంపురం గ్రామంలో అర్హత కలిగిన లబ్ధిదారులకు భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదు గా అందజేశారు. మంగళవారం రాంపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గ్రామానికి చెందిన షెడ్యూల్ క్యాస్ట్ వారికి భూమి కొనుగోలు పథకం కింద ప్రభుత్వం ఇచ్చిన భూములకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. భూమిపై సర్వ హక్కులు కల్పించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ చంద్రశేఖర్, మండల ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

మండల పరిధిలోని కాచాపురం సచివాలయం పరిధిలో మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందవచ్చునన్నారు. వైద్యాధికారి సురేష్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కౌతాళం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హామీ ఇచ్చారు. జీతాలు పెంచాలని ఆందోళన చేపట్టిన స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీల జీతాలు పెంచగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ, పింఛన్, బీమా విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి ఈరన్న, ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్ పొదుపుతోనే భవిష్యత్తు



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఆదోనిఅర్బన్: మారిన జీవనశైలి నేపథ్యంలో విద్యుత్ వినియోగం నానాటికి పెరిగిపోతోంది. ఫలితంగా బిల్లులు అధికంగా రావడంతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిని కట్టడి చేసేందుకు పొదుపు మంత్రం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈనెల 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్థానిక డీఈ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల్లో ఎమ్మిగనూరు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మిగనూరు సర్కిల్ నుంచి తిరిగి అదే ప్రధాన రహదారుల్లో డీఈ కార్యాలయానికి చేరుకున్నారు. ర్యాలీలో అనవసరంగా విద్యుత్‌ను వాడొద్దు, ఫ్లకార్డులు చేతబట్టి రహదారుల గుండా వెళ్తూ కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ, విద్యుత్ వినియోగం పొదుపుపై అవగాహన కల్పించారు.

రాయితీపై సరఫరా

ప్రభుత్వం యూనిట్ విద్యుత్‌ను రూ.18 చొప్పున కొని పేదలు, సామాన్యులకు రూ.1.50 నుంచి రూ.5 వరకు వివిధ కేటగిరీ, స్లాబ్‌ల మేరకు రాయితీపై సరఫరా చేస్తోంది. రాయితీ భారంతో పాటు వ్యవసాయ, ఉచిత విద్యుత్ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మేరకు డివిజన్ పరిధిలో 3.28 లక్షలు విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అగ్రికల్చర్ కింద 73 వేలు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రోజుకి 37 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. దీంతో 10 కోట్ల యూనిట్లకు పైగానే విద్యుత్ వినియోగం జరుగుతుంది.

పక్కాగా మీటర్ కౌంటింగ్

విద్యుత్ శాఖ ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ డిజిటల్ మీటర్లు అతి చిన్న ఎల్‌ఈడీ లైట్లను వినియోగించినా లెక్కిస్తాయి. గతంలో ఉన్న మెకానికల్ మీటర్ (చక్రం)ను తొలగించి ఎలక్ట్రానిక్ డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేశారు. రిమోట్‌తో ఆఫ్ చేసిన టీవీ, చార్జర్‌లకు ఉన్న ఎల్‌ఈడీ లైట్ల విద్యుత్ వాడకాన్ని కూడా ఇది పరిగణలోకి తీసుకుంటాయి. బిల్లింగ్ ఆపరేటర్లు వస్తే వారికి సులభంగా స్కానింగ్ ద్వారా బిల్లింగ్ వస్తుంది.

స్విచ్ ఆఫ్ చేస్తేనే ఉపయోగం

ఇల్లు, కార్యాలయం, దుకాణాల్లో మనకు విద్యుత్‌తో అవసరం తీరాక వెంటనే స్విచ్‌లు అన్ని ఆఫ్ చేయాలి. టీవీ, కంప్యూటర్‌లు వంటివి రిమోట్‌తో గాకుండా బోర్డులో ఉన్న స్విచ్‌లు ఆఫ్ చేయాలి.

విద్యుత్ పొదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ మోటార్ పంపుసెట్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఐఎస్ఐ మార్క్ మోటార్లను వినియోగిస్తే 25 శాతానికి పైగా విద్యుత్ ఆదా అవుతుంది.
- పైపులైన్ల పంపులు, బెండ్లు, వాల్వులు, జాయింట్లు ఎక్కువ లేకుండా చూడాలి.
- ఇళ్లల్లో సీఎఫ్ఎస్, ఎల్‌ఈడీ బల్బులను వాడాలి.
- ఐఎస్ఐ మార్క్ కలిగిన ఎలక్ట్రానిక్ గృహోపకరాలను వాడాలి.
- కంప్యూటర్‌లకు ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. షట్‌డౌన్ చేసుకున్నాక స్విచ్‌లను ఆఫ్ చేయాలి.

అవగాహన కల్పిస్తున్నాం



విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. లేకుంటే భావితరాలకు చీకట్లు తప్పవు. విద్యుత్‌ను అనవసరంగా వినియోగిస్తే బిల్లులు రెట్టింపు కావడంతో పాటు లోటు ఏర్పడుతుంది. పొదుపు సూత్రాలను పాటించాలి. రైతులు ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలకు వినియోగించరాదు. ఈ మేరకు డివిజన్ పరిధిలోని పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సుధాకర్‌కుమార్, డీఈఈ

సంక్షేమ పాలనను ఆదరించండి



రాయనగర్‌లో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోనిటౌన్: గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను జలగల్లా పీడించాయని, నేడు వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే పథకాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, జేసీఎస్ కన్వీనర్ ఫయాజ్‌అహ్మద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం 37వ వార్డు రాయనగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరణ, అభివృద్ధి ఫలాల డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తూచ తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య శ్రీ పథకం పరిధిని రూ.25 లక్షల వరకు పెంచడం హర్షణీయమన్నారు. పేద ప్రజలకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా పదవులు కట్టబెట్టడం, వారిని గౌరవించిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. 37వ వార్డులో రూ.26 కోట్లను ఖర్చు చేసి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అందించారని వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని కోరారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ మహేష్‌ప్రసాద్, సీనియర్ నాయకులు సింహం నాగేంద్ర, దానం ఈరన్న, తాయన్న, శ్రీనివాసులు, వేణు, తిప్పన్న, సురేష్, ఆర్‌పీలు, వలంటీర్లు అనిత, రత్నమ్మ, సారాకుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపిక

ఆదోని సెంట్రల్: పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నకె.అఫ్రిద్ సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ యస్.మురళిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విద్యార్థి అఫ్రిద్‌ను అభినందించారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్ ఫుట్‌బాల్ పోటీల్లో అఫ్రిద్ ప్రతిభ కనబరిచారని తెలిపారు.ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఎస్ఆర్‌యంఐఎస్‌టీ యునివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో అఫ్రిద్ పాల్గొననున్నట్లు తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని మాధవరం రోడ్డులో ఉన్న రాయనగర్ కాలనీకి చెందిన మారుతమ్మను బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. మారుతమ్మ రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు 100 శాతం అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లదేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో నాలుగవ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీసి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేయాలన్నారు. వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వ్యహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గడప గడపలో వచ్చిన ఫిర్యాదుల గురించి మండల స్థాయి అధికారులతో చర్చించారు. ఫిర్యాదులను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి లైట్లు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి షాహీద్‌కు సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రఘురాముడు, సర్పంచ్ రామాంజనేయులు, గజేంద్రరెడ్డి, ఈరన్న, పరమేష్, దేవదానం, తహసీల్దారు వీరేంద్రగౌడ్, ఈఓఆర్డీ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన విద్యార్థులు తైక్వాండో పోటీల్లో సత్తా చాటినట్లు తైక్వాండో మాస్టర్ ఎస్.దాదాబాషా తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను వ్యాపారవేత్త మాధవస్వామితో కలిసి మంగళవారం అభినందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 9, 10 తేదీల్లో జీసీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్ తైక్వాండో పోటీల్లో ఆదోనికి చెందిన విద్యార్థులు సత్తా చాటి గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. పట్టణం నుంచి 12 మంది పోటీల్లో పాల్గొనగా దేవాన్ష్, కెనిషా, సాబిర్, కైఫ్ గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. రితిషా, అశోక్, జీవన్, పాషిత, ఈశ్వర్, ఉమేర, హుసేనేఫ్ సిల్వర్ మెడల్ సాధించినట్లు చెప్పారు. వినయశ్రీ బ్రాంజ్ సాధించినట్లు పేర్కొన్నారు. సత్తా చాటిన క్రీడాకారులను అభినందించారు.

కుర్చీలను వదలరు

- ఉరుకుంద క్షేత్రంలో ఏళ్లతరబడి పాతుకుపోయిన అధికారులు
- డెప్యూటేషన్లపై విధులు.. విస్తుపోతున్న భక్తులు
- రెగ్యులర్ విధులపై ఏకైక అధికారి



ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం

మంత్రాలయం: స్వార్థమో.. స్వేచ్ఛాతనమో.. ఆ క్షేత్రం కుర్చీలంటే దేవదాయశాఖాధికారులకు మహా ప్రీతి. ఒక్కసారి ఇక్కడ కుర్చీలో కూర్చుంటే ఆ కుర్చీని వదులుకోవడం కష్టమే. ఎందుకు అంత మోజు చూపుతున్నారో గుట్టు స్వామికే ఎరుక. ఎన్నిసార్లు బదిలీ ఆర్డర్లు వచ్చినా ఇక్కడినుంచి అడుగు వేయరు. ఒకవేళ వేసినా రోజుల వ్యవధిలోనే డెప్యూటేషన్లపై ఇక్కడి పీఠాలపై వాలిపోతున్నారు. పాతికేళ్లుగా ఇదే తంతు. ప్రసిద్ధ ఉరుకుంద ఈరన్న క్షేత్రంలో పాతుకుపోయిన ఫేవికాల్ వీరులపై భక్తులు పెదవి విరుస్తున్నారు.

ఆలయ పరిపాలన కార్యాలయం వివరాలు

ఆలయ పరిధిలో మొత్తం ఈఓ, 3 సూపరింటెండెంట్, 3 సీనియర్ అసిస్టెంట్, 2 జూనియర్ అసిస్టెంట్, 4 అటెండర్, 3 రెగ్యులర్ విద్వాంసులు, 14 రెగ్యులర్ పూజారి పోస్టులు ఉన్నాయి. అలాగే కాంట్రాక్టు పద్ధతిన 28 మంది, అవుట్ సోర్సింగ్ విధానంలో 52 మంది పనిచేస్తున్నారు. మొత్తం ఆలయం పరిధిలో 109 మంది వివిధ పద్ధతుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ పోస్టుల్లో ఏకైక వ్యక్తి మాత్రమే రెగ్యులర్ అధికారిగా పనిచేస్తుండడం విశేషం.

మోజు ఎందుకో?

ఆలయంలో కేవలం 3 సూపరింటెండెంట్ పోస్టులు ఉండగా అదనంగా మరొకరిని నియమించారు. పోస్టు లేకున్నా డెప్యూటేషన్‌పై కసాపురం అధికారిని తెచ్చి కూర్చొబెట్టారు. సీనియర్ అసిస్టెంట్లలో రామలింగారెడ్డి మాత్రమే ఇక్కడ రెగ్యులర్. ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్వరరావు (రెగ్యులర్-కదిరి), మల్లికార్జున (రెగ్యులర్-బోయకుంట), విజయ్‌కుమార్ (రెగ్యులర్ - గండి) డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్లు కిరణ్ (రెగ్యులర్- కదిరి), విజయ్‌కుమార్ (రెగ్యులర్-యాగంటి), వీరేష్ (రెగ్యులర్-ప్యాపిలి) డెప్యుటేషన్లపై వచ్చిన అధికారులే. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా ఇక్కడి నుంచి కదలకపోవడం విచిత్రం

ఇందుకేనా ?


ఇక్కడ పనిచేసే అధికారులకు పని ఒత్తిడి అంతంత మాత్రమే. శ్రావణ మాసంలో మాత్రమే చేతినిండా పని ఉంటుంది. ఇక్కడి అధికారులు ఎప్పుడు విధులకు హాజరవుతారో కూడా తెలియని పరిస్థితి. అయితే ఉత్సవాల వేళ ఇక్కడ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు తలో విభాగాలను చూస్తారు. అన్నదానం, లడ్డూ ప్రసాదం, పులిహోర తయ్యారీలో వెనకేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేగాక ఇక్కడ టెండర్లు సొంతం చేసుకున్న కాంట్రాక్టర్ల నుంచి మామూళ్లు అందుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి అధికారులు బదిలీపై వెళ్లడం లేదనేది బహిరంగ రహస్యం. అధికారులు పాతుకుపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు కాంట్రాక్టర్ల అవతారమెత్తినట్లు వినికిడి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫేవికాల్ అధికారులను సాగనంపాలని భక్తులు కోరుతున్నారు.

కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం

ఇటీవల ఉరుకుంద ఆలయాన్ని సందర్శించడం జరిగింది. కార్యాలయంలో అందరూ డెప్యూటేషన్‌పై పనిచేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై త్వరలోనే దేవదాయ శాఖ కమిషనర్‌కు రిపోర్టు పెడతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డెప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటాం.

– రామాంజినేయులు, అసిస్టెంట్ కమిషనర్, కర్నూలు

వైభవంగా కుంభోత్సవం



కుంభోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఆదోనిరూరల్: మండలంలోని మాంత్రికి గ్రామంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్థానిక ఈశ్వర స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ శివారులోని సుంకులమ్మవ్వకు కుంభోత్సవ కార్యక్రమం చేపట్టారు. వేల సంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొలిచిన వారికి కొంగుబంగారంగా వరాలిచ్చే అమ్మవారిగా ఇక్కడి సుంకులమ్మ ప్రసిద్ధి చెందింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



సుంకులమ్మవ్వ ఆలయానికి కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు